# పరివర్తన

అనిపెద్ది వెంకటరత్నం

ఆరోజు ఉదయం 7 గంటలకే "సరిత" తన తల్లి గారి యింటివద్ద అలవాటు ప్రకారం పూజా సామగ్రి సమకూర్చుకొని శ్రద్ధాభక్తులతో తులసీ పూజ చేస్తూంది. అక్కడ ఆమె జీవిత సాగరంలో ఎట్టి అలజడి లేక దైవానిదే భారం అన్నట్టు చుక్కాని లేని తన జీవిత నౌకను నడుపుతూ వుంది.

పూజ పూర్తి అయి తులసికి మంగళహారతి ఇచ్చి అపరాధం క్షమించ మన్నట్లు చెంపలు వేసికొని దేవికి వంగి నమస్కరిస్తూ వుంది. అదేసమయంలో తులసీదేవిమీద పూజచేసిన పువ్వులు కొన్ని అప్రయత్నంగా దగ్గరనే వుంచిన హారతి పళ్ళెంలో జల జల మని రాలాయి. యింతలో బయట తలుపు తట్టినట్లు అనిపించిందామెకు. ప్రసాదం తీసుకొని వెళ్ళి తలుపు తెరచింది. పోస్టుజవాను ఒక కవ రామెచేతికిచ్చి చక్కాపోయాడు. తన బాధ్యత తీరిపోయినట్లు అందుకున్న కవరు ఆత్రంగా చించి ఈవిధంగా చదివింది.

ప్రియమైన సరితకు.

నా యీ హీనస్థితిలో నీవే శరణ్యమని యిప్పటికి గ్రహించగలిగాను. ఈ అభాగ్యునికి నీహృదయంలో స్థానంపుంచే నీరాకకు నిరీక్షిస్తున్న

"ఆనంద్"

ఉత్తరాన్ని ఆమె తన పవిత్రాశ్రువులతో తడిపింది. అంతవరకు ఏదరి కానరాని తన జీవిత నౌకకు వడ్డు సమీపించుచున్నదన్న సంతోషంతో ఆమె ఆనందాశ్రువులనే రాల్చిందనుకుంటాను.

పసితనంలోనే తన మాతృదేవతను పోగొట్టుకొన్న అభాగ్యజీవి సరిత. తల్లి లేని బిడ్డ అవడంవల్ల తండ్రి ఆమెను కళ్ళల్లో పెట్టుకొని పెంచి తగినట్లుగా విద్యాబుద్ధులు చెప్పించి యుక్తవయస్సు రాగానే మూడు ముళ్ళూ పడ్డాక అత్తవారింటికి పంపాడు రామయ్య. "సరిత" చిన్నతనంనుంచీ అభాగ్య జీవి అవడంవల్ల కాబోలు వివాహం అయి అత్తవారింటికి వెళ్ళిన కొద్ది కాలానికే భర్త ఆగ్రహానికీ, అజ్ఞానానికీ గురియై పుట్టింటికి నెట్టబడింది.

తండ్రి చేతికి ఆ వుత్తరాన్నిచ్చింది నీ అభిప్రాయమేమన్నట్టు. ఉత్తరంలో అంతరార్థాన్ని గ్రహించిన తండ్రి కుమార్తెను ఆ మర్నాడే అత్తవారింటికి వెళ్ళవలసినదిగా ఆదేశించాడు.

ఆరాత్రి 'సరిత' తండ్రికి భోజనంపెట్టి తనింత తిని మర్నాడు అత్తవారింటికి ప్రయాణానికి కావలసిన పరికరాలు సర్దుకొని ప్రొద్దుపోయి పడుకుంది. కాని నిద్రపట్టలేదు. ఆ రాత్రంతా ఆమె మనోసాగరంలో ఏవో వూహించి వ్రాయజాలని భావతరంగాలు లేచాయి. కాని అవి ఒడ్డుకు చేరకుండగానే మాయమౌతున్నాయి. ఆమె ఆ రాత్రంతా తన మనోసాగరభావతరంగాలలో మునిగి తేలుతూ కాలం గడిపింది.

"ఆనంద్" తండ్రికి ఒకే బిడ్డ కావడంవల్ల కొంచెం గారాబంగానే పెరిగాడని చెప్పవచ్చు. పెంచి పెద్దవాణ్ణి చేసి ఆనందించవచ్చుననుకున్న ఆ తండ్రి ఆలోచనలకు విరుద్ధంగా "ఆనంద్" ప్రవర్తన మారు త్రోవలు త్రొక్కుతున్నట్లు గ్రహించి ఈసమయంలో వివాహం చేస్తే బాగుపడగలడన్న వూహలతో వివాహం చేశాడు తండ్రి. (ఈసమయంలో మనపెద్దలు కొంతవరకు ఓప్పుతోను, తెలివితోను మెలగడం మంచిదనుకుంటా) కాని వివాహం అయి భార్య కాపురానికి వచ్చిన కొద్ది రోజులకే ఆనందు పూర్తిగా మారిపోయాడు. కని పెంచిన తలిదండ్రులను కాదని ఆస్తిని పంచుకొని దుష్ట సహవాసాలకూ, దురభ్యాసాలకూ దాసుడై ఒళ్ళు మరచి ప్రతిరోజూ భార్యను అనేక విధాలుగా హింసించడం ఆనందుకు ఒక పని అయింది.

తల్లిలేని బిడ్డ, ఎన్నడూ కన్న తండ్రిచేతనయినా ఒక్కమాట పడిఎరుగని "సరిత" ఈనాడు పరపురుషునిచేత పుస్తె కట్టించుకున్న పుణ్యానికి భర్త పెట్టే బాధలను

సహిస్తూ తన అభాగ్యానికి కృంగి కృశిస్తూ ప్రొద్దుపుచ్చుతూవుంది.

ఆరోజు రాత్రి ఆనంద్ పూర్తిగా త్రాగి మైమరచి యింటికివచ్చి భార్యను అకారణంగా కొట్టి తిట్టి పుట్టింటికి నెట్టాడు.

"ఆనంద్" క్రమక్రమంగా తన ధనాన్నంతటిని గ్రీష్మరుతువులోని చెరువునీటిమాదిరి కాజేశాడు. ఆనాటి అతని ఆత్మమిత్రులిప్పుడతని ఆత్మశత్రువులయ్యారు. వారు అతనిని ఎండిన చెఱువును కప్పలు వదిలినట్లు అతనిని వదిలిపోయారు. ఇప్పుడు "ఆనంద్" ఏకాకి అయ్యాడు. ఈ స్థితిలో అతనికి రోజు గడవడం కష్టతరం అయింది. తిన తిండికి కట్టబట్టకు దూరమయ్యాడు. శరీరం శుష్కించుతూంది! అటు కని పెంచిన తలిదండ్రులను, ఇటు అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యను కాదని కాలతన్నుకున్నాడు. ఈ హీన స్థితిలో జీవితంమీద రోతపుట్టి యిక ప్రపంచంలోవుండి మాత్రం ప్రయోజనం లేదని భావించి, ఈ పరిస్థితిలో అతనికి ఆత్మహత్య అన్నివిధముల మేలనుకున్నాడు కాబోలు. అందుకు వెనుదీయకుండా తన యింటిలోని దూలమునకు త్రాడుగట్టి వురితీసికొనడానికి త్రాడు మెడకు తగిలించబోతూ మెడ పైకి ఎత్తాడు. ఎదురుగా గోడకు తగిలించిఉన్న ఫొటో అతని దృష్టికి గోచరించింది. ఫొటోలోని నవ్వుతున్న యువతిని అతడు ఆశ్చర్యంగా చూడసాగాడు. ఆ ఫొటోలోని వ్యక్తి చిరునగవుతో "ఆగు త్వరపడకు. ఆత్మహత్య, అసమర్థులకు, పిరికి పందలకు అవసరమైనది. నీవు నీగతాన్నంతటినీ మరచిపో! ఈ పరిస్థితిలో ఓర్పు అవసరం. మానవ జీవితం సుఖ దుఃఖపూరితము. సుఖానికి సంతోషించడం. దుఃఖానికి విచారించడం మానవ సహజం. గతాన్ని మరచి భావి కర్తవ్యాన్ని గురించి యోచించు. కష్టాలను ఎదుర్కొనలేక చావడంకన్న బ్రతికి సాధించినవాడే ఉత్తమ మానవుడు. ఇప్పటికైనా మించిపోయినదిలేదు." అని ఏవేవో మాటలు చెప్పినట్లు అతనికి అనిపించింది కాబోలు. వేసినముడి విప్పాడు. తరువాత తెలివి తెచ్చుకొని ఆ ఫొటోలోని యువతి అలనాడు అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య "సరిత" అని గుర్తించగలిగాడు. అప్పుడు అతడు తన మనస్సులో, అరిగి చిల్లులుపడి శిథిలమై తిరిగి నూతనంగా నిర్మించబోయే తన సంసార నౌకలో స్వేచ్ఛగా విహరించుటకు "సరిత" అవసరం అని గ్రహించ గలిగాడు.

ఫొటోవైపు మరొకసారి చూచి కన్నీరు కార్చాడు. క్షమించమని అర్థించినట్లుగా వెంటనే ఆమెపేర ఒక లేఖ వ్రాసిపంపాడు. కానీ ప్రతిఫలం ఏమౌతుందోనన్న వూహలతో ఆనందుకు నిద్రపట్టలేదు. ఆలోచనలతో ఆఖరుజామున ఒళ్ళు తెలియకుండా నిద్రపట్టింది.

ఎవరెన్నిపనులను మానుకొన్నా తనపని తను మానని బాల భాస్కరుని లేతకిరణాలు ఒడలు తెలియకుండా నిద్రపోతున్న "ఆనంద్"ను కిటికీ ఊచలమధ్య నుండి నీ సోమరితనాన్ని చాలించు అన్నట్లు అతనికి జాగృతిని కలిగించాయి,

ఆరోజున ఆనందులో ఏదో ఆనందం ఉదయించినట్లయింది. కాలకృత్యాలు తీర్చుకొని అప్పటికి కొన్ని సంవత్సరాలుగా పాడై దుమ్ముపట్టిన వస్తువులను బాగుచేస్తూ వాటిని యథాస్థానంలో సర్దుతున్నాడు బాధ్యత గల సంసారిలాగ. పగలంతా కఠినపరిశ్రమచేత అలసట చెందిన సూర్యభగవానుడు తన విశ్రాంతిగృహం చేరపోతున్నాడు. ఆసమయంలో ఆనంద్ తన దొడ్డిలోని మాలతీతీగక్రింద కుర్చీలో కూర్చుని ఏదో కథ చదువుతున్నాడు మైమరచి. అది తన జీవితానికి సరిపోతుందేమో! కథలో ఒక యువతి దురాచారియగు తన భర్తచేత త్యజించబడి తిరిగి అతని కోరికపై కొంతకాలానికి అత్తవారింటిలో అడుగు పెట్టింది. యింతవరకు కథను మైమరచి చదువుతున్న ఆనందుకు వీధితలుపు తట్టుతున్నట్లు వినిపించింది. పుస్తకంపేజీలు బ్రేళ్ళసందున పెట్టుకొని వెళ్ళి తలుపు తెరచాడు ఎవరా? అని. గుమ్మంలో నిలబడిన ఆమెను చూచి తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు. సరిత తన భర్త మలినవస్త్రములను శుష్కదేహమును చూచి నోట మాటరాక దుఃఖాశ్రువులు రాల్చింది. ఆనందమై కళ్లవెంటరాలు కన్నీటి ముత్యాలను తన చేతులతో ఏరుచూ ఆమెచేతులు పట్టుకొని ఆమెనిలా అర్థించాడు. "అలనాడు రాత్రి ఏపాపపు చేతులు నిన్ను కొట్టి హింసించాయో ఈనాటిరాత్రి ఆచేతులే నిన్ను "క్షమార్పణ" వేడుకుంటున్నాయి సరితా!"

తెల్లవారింది. సరిత తన తండ్రికి లేఖ వ్రాసింది.
పూజ్యశ్రీ నాన్నగారికి.

నేనిప్పుడు "ఆనందం" తో వున్నాను

మీ కుమార్తె "సరిత"